# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త


## ఆటో బోల్తా : ఆరుగురికి గాయాలు

### -ఇద్దరి పరిస్థితి విషమం



చౌడేపల్లి, జనవరి 31 ప్రభాతవార్త మండలంలోని పరికిదొన మార్గంలో గల దొడ్డిగానిదేవళం కోళ్ళఫారాల వద్ద ప్రయాణికులను తరలించే ఆటో బోల్తా పడి 6గురికి గాయాలు కాగా వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది. చౌడేపల్లి-పరికిదొన ప్రధాన రహదారిలో పరికిదొన వైపు ప్రయాణికులను తరలిస్తున్న ఆటో దొడ్డిగానిదేవళం వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో పరికిదొన రెడ్డెప్ప(75), కాటమన్న(45), వెంకటమ్మ(60), లక్ష్మమ్మ(70), గడ్డం వారిపల్లి రమణమ్మ(50), పలమనేరు మండలం కురపల్లి ప్రవీణ్‌కుమార్(7)లకు గాయాలు య్యాయి. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని స్థానికులు 108సేవల ద్వారా స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ రెడ్డెప్ప, లక్ష్మమ్మల ఆరోగ్య పరిస్థితి విషమించ చడంతో అదే వాహనంలో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తెప్పపై గోవిందరాజస్వామి అభయం



తిరుపతి,జనవరి 31ప్రభాతవార్త: గోవిందరాజస్వామి ఆలయ వార్షిక తెప్పోత్సవాల్లో ఆరవరోజు శనివారం సాయంత్రం శ్రీదేవిభూదేవిసమేత గోవిందరాజస్వామి భక్తులను కటాక్షించారు. సాయంత్రం 6.30 గంటలకు తెప్పపై ఏడుచుట్లు విహరించి భక్తులకు అభయమిచ్చారు. పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓఅనిల్‌కుమార్‌సింఘాల్, ఎఫ్ఎసిఎ బాలాజీ, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ నారాయణచౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయ,అర్చకులు పాల్గొన్నారు.

### కల్తీనెయ్యి వివాదంలో

# మలుపులు.. ఉత్కంఠత!

### -సిట్ నివేదికలతో ఎవరికి ఎసరో!?




ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

లడ్డూలకు కల్తీనెయ్యి వివాదం చిలికిచిలికిగాలివానలా తయారై సిబిఐ సిట్ అధికారుల నివేదికలతో తిరుగుతున్న మలుపులు టిటిడిలో అలజడి సృష్టిస్తోంది. తొలినుండి పెద్ద దుమారంరేపుతున్న కల్తీనెయ్యి కేసులో తాజాగా నెలకొన్న పరిస్థితులు ఎవరి పదవులకు ఎసరుపెడుతుందనేది టిటిడి వర్గాల్లో హాట్‌టాఫిక్‌గా మారింది. లడ్డూలకు కల్తీనెయ్యి వినియోగించారనే విషయంపై 2019-24 మధ్యకాలంలో టెండర్ల నిబంధనలు మార్చడం, అప్పటి ఈఓగా పనిచేసిన, ప్రస్తుతం ఈఓగా కొనసాగుతున్న అనిల్‌కుమార్‌సింఘాల్ వ్యవహారాన్ని సిట్ తప్పుపట్టింది. అప్పట్లో టిటిడి బోర్డు పెద్దలు నిబంధనలు మార్చినా ఈఓ స్థాయి అధికారిగా ఎందుకు ప్రశ్నించలేదని, దానిపై అధికారుల బృందంతో ఎందుకు ఆమోదించారనేది ఇప్పుడు ప్రభుత్వం వద్ద ఉన్న చిట్టా. టిటిడిలో కీలక పోస్టులో దీర్ఘకాలంగా కొలువుదీరిన ముఖ్యగణాంకాధికారి (ఆర్థికవిభాగం)ఎఫ్ఎసిఎఓ బాలాజీ వ్యవహారంపై కూడా సిట్ సమగ్ర నివేదిక ఇవ్వడం, మాజీ ఈఓ ఏవి ధర్మారెడ్డిపై మరింత లోతుగా నివేదికలు ఇచ్చి చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేయడంతో ఇప్పుడు ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఏంటనేది అటు టిటిడి వర్గాల్లో ఇటు రాజకీయంగానూ పెద్ద మలుపుతిరగనుంది. ప్రస్తుత ఈఓ సింఘాల్‌పై చర్యలు తీసుకుంటే ఆయనను పదవి నుండి తప్పించి బదిలీ చేయనుందనే దుమారం రేపుతోంది. కల్తీనెయ్యి వ్యవహారమే సంచలనంగా మారినా తాజా నిర్ణయాలు టిటిడిలో మరింతగా ఉత్కంఠగా మారింది. మరీ సమర్ధవంతమైన ఐఎఎస్ అధికారి,అనుభవం ఉన్న అనిల్‌కుమార్‌సింఘాల్‌ను రెండవసారి నియమించడం ఇప్పుడు కల్తీనెయ్యిలో ఆయన చిక్కుకోవడం ఎంతవరకు దారితీస్తుందనేది మరికొన్ని గంటల్లో తేలిపోనుంది. ఇక ఎఫ్ఎసిఎఓ బాలాజీ వ్యవహారంలో ఆయన పదవీకాలం మరో ఏడాదిన్నర మాత్రమే ఉంది. ఆయనన్ను తప్పిస్తారా లేక తగిన శాఖాపరమైన చర్యలు ఉంటాయా అనేది టిటిడిలో చర్చమొదలైంది. ఓ వర్గం ఆయన మంచి అధికారిగా, తన విధులను నిక్కచ్చిగా చేసుకెళతారనేది వాదన వినిపిస్తోంది. మరీ ఎంతో సంచలనం రేపిన కల్తీనెయ్యిలో ఆయన మరక అంటించుకుంటారా?లేదా అనేది చూడాల్సిందే. రెండురోజులుగా సిట్ నివేదికలు ప్రభుత్వానికి అందడంతో కల్తీనెయ్యి బాగోతంలో కర్త,కర్మ,క్రియ ఎవరనేది ఆధారాలతో తేల్చేసినా సూత్రధారులు ఎవరనేది వెల్లడించకపోవడం వెనుక పెద్ద ట్విస్ట్ ఉందని ప్రస్తుత టిటిడి బోర్డు పెద్దలు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, సభ్యులు తిరుపతిలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించడం పెద్ద హాట్‌టాఫిక్‌గా మారింది. ఇదే సమయంలో గత టిటిడి ఛైర్మన్,వైసిపి ఉమ్మడిచిత్తూరుజిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆయన ఇంట్లో నిందారోపణ ప్రాయశ్చిత్త పరిహార హోమం చేపట్టడంతో మరింత వేడెక్కించింది. తప్పులుచేసి అబద్దాలతో హోమాలు చేయడం దేనికి నిదర్శనమని తాజా బోర్డు సభ్యులు విరుచుకుపడ్డారు.

# మరో జన్మ ఉంటే కుప్పంలోనే పుడతా : సిఎం చంద్రబాబు

శాంతిపురం, జనవరి 31 ప్రభాతవార్త

మరో జన్మ ఉంటే తాను కుప్పంలోనే పుడతానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. శనివారం మండలంలోని తులసినాయనపల్లి వద్ద ఏర్పాటుచేసిన ప్రజావేదిక బహిరంగసభలో సిఎం పాల్గొని ప్రసంగించారు. కుప్పం ప్రజలు తనకు స్ఫూర్తి అని కుప్పాన్ని అన్ని రంగాల్లో నెంబర్‌వన్ చేస్తానని ప్రకటించారు. ప్రయోగశాల అయిన కుప్పంలో రానున్న నాలుగు నెలల్లోనే పెనుమార్పులు వస్తాయని పేర్కొన్నారు. కుప్పాన్ని మంచి నియోజకవర్గం చేయాలనేదిశగా చర్యలు చేపట్టామన్నారు. 400 ఎకరాల్లో పొగురుపల్లి, తంబిగానిపల్లి వద్ద పారిశ్రామికవాడలు ఏర్పాటవుతున్నాయన్నారు. కుప్పం నియోజకవర్గంలో డెబ్బై వేల ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. కుప్పానికి ఇప ్పటికే 12 పరిశ్రమలు వచ్చాయని ఇ ంకా పరిశ్రమలు వస్తాయని పేర్కొన్నారు. 7వేల కోట్ల దాకా పెట్టుబడులు రానున్నాయన్నారు. కుప్పం ప్రాంత యువకులు ఉద్యోగాలకు బయటకుఎక్కడికీ వెళ్లకుండా ఇక్కడే ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలనేది తన ఆశయమన్నారు. కుప్పం ప్రాంతంలో పేదరికం రూపు మాపేందుకు పి4 కార్యక్రమం తెచ్చామన్నారు. ఇక్కడ అదాని, మేఘా ఇంజనీరింగ్, టివిఎస్ సంస్థలు ముందుకు వచ్చి పేద కుటుంబాలను ఆదుకునేలా పనిచేస్తాయన్నారు.

నీళ్లకోసం మహాయజ్ఞం చేస్తున్నా:

రాయలసీమ జిల్లాలకు సాగునీరు పూర్తిగా అందించే ందుకు మహాయజ్ఞం చేస్తున్నట్లు సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.






ప్రజావేదిక బహిరంగసభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు, .పాడి రైతుతోమాట్లాడుతున్న సిఎం

కుప్పంలో ప్రతి చెరువును కృష్ణాజలాలతో నింపుతామని అది తన బాధ్యత అన్నారు. వర్షపునీటిని భూగర్భజలాలుగా మార్చేందుకు కృషి చేయాలని సూచించారు. పేదలకు సాయం చేసేందుకే సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తున్నట్లు సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బడికి వెళ్లే ప్రతి పిల్లాడికి 15వేలవంతున తల్లికివందనం, ప్రతి మహిళలకు 3ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామన్నారు. రైతులకు 20వేలను మూడువిడతల్లో చెల్లిస్తున్నట్లు చెప్పారు. స్త్రీశక్తి పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని దీంతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయన్నారు. మహిళల అభ్యున్నతికి డ్వాక్రా సంఘాలు పెట్టామని దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళల ఖాతాల్లో 26వేలకోట్లు కార్పస్ ఫండ్ ఉ ందన్నారు. కుప్పంలో ఒకప్పుడు పాడి ఆవులు ఇస్తామంటే నవ్వారని నేడు 5.60లక్షల లీటర్ల పాల ఉత్పత్తి కుప్పంలో రోజుకు జరుగుతోందన్నారు. రైతులు కూడా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సిఎం సూచించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వవిప్ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్ రావు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ ప్రాజెక్ట్‌డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, జిల్లాటిడిపిఅధ్యక్షుడు షణ్ముగంరెడ్డి, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిడిపి మండలఅధ్యక్షుడు ఉదయ్‌కుమార్, నేతలు వెంకటాద్రినాయుడు, విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, నాగభూషణంరెడ్డి, ఎల్.జయరా ంరెడ్డి, మణి, రాధాకృష్ణనాయుడు,చంద్ర, బసవరాజు, గోపాల్, శేఖర్, రాజు, ఉమాపతి, బాలు, రమేష్, శివ, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ, శ్యామల పాల్గొన్నారు.

## ప్రసన్న వెంకటేశ్వరునికి ఊంజల్‌సేవ



వడమాలపేట, జనవరి 31 ప్రభాతవార్త: అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారికి శనివారంఊంజల్‌సేవ, గ్రామోత్సవం వైభవంగా జరిగింది. వేకువ జామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను శాస్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఉభయదేవేరులతో పాటు స్వామివారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువుదీర్చి స్వామివారు గంటపాటు చిద్విలాసంగా ఊయలలుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన స్వామివారు మాడవీధుల్లో విహరించగా భక్తులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, షరాబు రవీంద్ర,ప్రధాన అర్చకులు సూర్య కుమారాచార్యులు, తిప్పయాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

# చెవిరెడ్డికి అపూర్వ స్వాగతం

### -వైసిపి శ్రేణులలో ఉప్పొంగిన ప్రజాభిమానం

తిరుపతిరూరల్, జనవరి31 ప్రభాతవార్త:



226రోజుల జైలు జీవితం తర్వాత విడుదలైన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. ఏర్పేడు టోల్‌ప్లాజా నుంచి 150 కార్లు, దామినేడు నుంచి 250 బైకులతో భారీ ర్యాలీ చేపట్టగా అడుగడుగునా హారతులు, గజమాలలు, బాణాసంచా పేలుళ్లతో జాతీయ రహదారి మార్మోగింది. 226 రోజుల జైలు నిర్భంధం అనంతరం నియోజకవర్గంలో అడుగుపెట్టిన చెవిరెడ్డిని చూసేందుకు వేలాది మంది స్వచ్ఛంధంగా తరలివచ్చారు. తనపల్లి క్రాస్ వద్ద జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. మూడు గంటల పాటు సాగిన ర్యాలీ చంద్రగిరి రాజకీయాల్లో కొత్త ఊపునిచ్చింది. ఈ ర్యాలీలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలవగా 'మోహిత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.

# త్రిశూల స్నానానికి సన్నాహాలు: విస్తృత ఏర్పాట్లు

## నేడు ఉత్సవం

శ్రీకాళహస్తి,జనవరి 31 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సన్నాహాలు జరుగుతున్నాయి.ఆదివారం సద్యోముక్తి ఉత్సవాలకు స్వర్ణముఖి నదిలో సన్నాహాలు చేస్తున్నారు.ఈ ఉత్సవాలతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టినట్లే. ఈ ఉత్సవానికి వేలాది మంది మహిళా భక్తులు వస్తారు. కాబట్టి ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని ఇఓ డి.బాపిరెడ్డి ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. శివరాత్రి ఉత్సవాలకు ముందు నిర్వహించే ఉత్సవం ఏటి ఉత్సవం, సద్యోముక్తి వ్రతం.ఈ ఉత్సవం ఈ ఏడాది ఫిబ్రవరి 1న వచ్చింది.ఆదివారం కాబట్టి భారీ ఎత్తున భక్తులు హాజరుతారనే అంచనాలతో ఏర్పాట్లు చేపట్టారు. ఈ ఉత్సవంతో పట్టణ వాసులకు శివరాత్రి సంకేతాలు వెళతాయి. ఈ ఏడాది శాసనసభ్యుని సూచనలతో ధర్మకర్తల మండలి, అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్న మహాశివరాత్రి కాబట్టి అధికారులు ముందుజాగ్రత్తగా చక చకా పనులు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలకు సంబంధించి ఎప్పటి కప్పుడు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సమీక్షించుకుంటూ ధర్మకర్తల మండలికి సూచనలిస్తున్నారు.

సద్యోముక్తి ఉత్సవం:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాల్లో మహాశివరాత్రికి ముందు వచ్చే పెద్ద ఉత్సవం 'త్రిశూల స్నానం' ఈ ఉత్సవంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టినట్లే. సాధారణంగా ఈ ఉత్సవాన్ని సువర్ణముఖి నదిలో నిర్వహించటం ఆనవాయితి. త్రిశూలాన్ని పవిత్ర సువర్ణముఖి నది జలాల్లో స్నానమాచరింపజేస్తారు.ఉత్సవర్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. ఇందుకు ఏర్పాట్లు చేయుటకు ఇఓ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఆదేశించారు.

# నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

### జిల్లా వ్యాప్తంగా 128 సెంటర్ల ఏర్పాటు... హాజరుకానున్న 12,058మంది విద్యార్థులు.

తిరుపతి విద్య,జనవరి 31 ప్రభాత వార్త



జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న ఎంపీసీ,బైపీసీ,జనరల్ కోర్సుల విద్యార్థులకు ఆదివారం నుంచి ప్రధాన ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభమవుతాయని ఆర్ఐఓ జి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాక్టికల్స్ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 128 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.పరీక్షా కేంద్రాలల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసి పటిష్టమైన నిఘా ఉంచామని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఉదయం,సాయంత్రం రెండు సెషన్లలో జరిగే పరీక్షలకు 12,058 మంది విద్యార్థులు హాజరువుతారని,ఈ పరీక్షలు రెండు విడతలో నిర్వహిస్తున్నామని చెప్పారు. స్పెల్1లో 90 పరీక్షా కేంద్రాలలో ఆదివారం నుంచి ఈనెల 5వ తేదీవరకు,అలాగే స్పెల్2లో 89 సెంటర్లలో 6వ తేదీ నుంచి 10వ తేదీవరకు ప్రయోగ పరీక్షలు జరుగుతాయని తెలియజేశారు.పరీక్షలలో ఎటువంటి అవినీతికి చోటు లేదని,విద్యార్థి ప్రతిభ ఆధారంగానే మార్కులు స్కోర్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.అవాస్తవాలను నమ్మకుండా విద్యార్థులు ప్రయోగ పరీక్షలలో ప్రతిభచూపి రాణించాలని చెప్పారు.

# టీటీడీ దర్శనాల లేఖలను కూడా అమ్ముకున్నారు

### - టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి



వెంకటగిరి, జనవరి 31, ప్రభాతవార్త తిరుమల తిరుపతి దర్శనానికి ఇచ్చే లేఖలను కూడా వైసిపి వారు అమ్ముకున్నారని మాజీ కేంద్రమంత్రి, జిల్లా టిడిపి అధ్యక్షులు, టిడిపి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి ఆరోపించారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల నెయ్యిలో కల్తీ జరగలేదని వైసీపీ నేతలు చెబుతున్నారంటే.. వారు స్వయంగా వెంకటేశ్వర స్వామి పాదాల చెంత ప్రమాణం చేయడానికి సిద్ధమా? అంటూ ఆమె సవాల్ విసిరారు. టీటీడీ మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి గానీ, ఇతర వైసీపీ నేతలెవరైనా గానీ కల్తీ జరగలేదని స్వామివారి సన్నిధిలో గానీ కాణిపాకంలో గానీ ప్రమాణం చేయగలరా? అని ఆమె ప్రశ్నించారు. లడ్డూ నెయ్యి కల్తీ వంటి తీవ్ర ఆరోపణలపై స్పష్టత ఇవ్వాల్సిన బదులు వైసీపీ నేతలు హోమాలు, పూజల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. వారు చేసిన పాపాలను కడుక్కోవడానికే ఈ హోమాలు అంటూ ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీటీడీ బోర్డు భక్తుల సేవలో తరిస్తోందని, గత పాలనలోలా భక్తులను మోసం చేసే పరిస్థితి లేదని పనబాక లక్ష్మీ స్పష్టం చేశారు. లడ్డూ నెయ్యి కల్తీ వంటి విషయంలో నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు తిరుమల శ్రీవారి సన్నిధిలో మద్యం బాటిళ్లు పెట్టి ఆ అంశాన్ని తెరపైకి తేవడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు. ఏఎంసీ ఛైర్మన్ పునుగొట్టి విశ్వనాథం పనబాకలక్ష్మిని ఘనంగా సన్మానించారు.

## టెంపోను ఢీకొన్న కారు: డ్రైవర్‌కు గాయాలు

శ్రీకాళహస్తిరూరల్,జనవరి 31 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకొని వెళుతున్న కర్నాటకకు చెందిన టెంపో టైర్ పంక్చర్ కాగా లాంకో ఫ్లైఓవర్ వద్ద మరమ్మత్తులు చేసుకుంటుండగా తిరుపతి వైపు వెళుతున్న మరో కారు వెనుక నుంచి ఢీకొంది. దాంతో ఖాళీగా ఉన్న టెంపో బోల్తా పడింది. టెంపోలో ఉన్న కర్నాటక భక్తులను దించి పంక్చర్ వేసుకుంటుండటంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.అయితే మరమ్మత్తులు చేసుకుంటున్న టెంపో డ్రైవర్ మంజునాధ్ గాయపడి శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు

శ్రీకాళహస్తి-తిరుపతి జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ స్కూటరిస్టు గాయపడినట్లు సమాచారం.రూరల్ ఎస్ఐ వెంకటేశ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతికి చెందిన వ్యక్తి స్కూటరిస్టు వేగంగా వెళుతూ ముందు పోతున్న కంటైనర్‌ను ఢీకొన్నాడు. అయితే కంటైనర్ గమనించకుండా వెళ్ళాడు. దాంతో గాయపడిన స్కూటరిస్టు కంటిపై భాగంలో గాయమైంది. ఆతను తిరుపతికి వెళ్ళాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్కూటరిస్టు స్కూటర్‌కు వస్తే తప్ప సమాచారం తెలియదని పోలీసులు వివరించారు.

## పులికాట్ సరస్సులో పక్షుల గణన పూర్తి

సూళ్లూరుపేట, జనవరి 31 ప్రభాతవార్త



ప్రపంచంలోని అతిపెద్ద ఉప్పునీటి సరస్సుగా పేరొందిన పులికాట్‌లో స్వదేశీ, విదేశీ పక్షులకు సంబంధించి గణన పూర్తయింది. గత నాలుగు రోజులుగా ఈ గణన చేపట్టారు. వన్యప్రాణి విభాగం వారి ఆధ్వర్యంలో జరిగిన సర్వేతో పాటు పక్షుల గణన కార్యక్రమంలో 118 రకాల విదేశీ పక్షులు, ఒక లక్షా 99 వేల 659 స్వదేశీ పక్షులు పులికాట్‌లో ఈ ఏడాది ఉన్నట్లు గుర్తించారు. పక్షులపై అధ్యయనం చేస్తున్న పరిశోధకులతో పాటు బాంబే నేచురల్ సొసైటీ, ఐఎసిఆర్ తిరుపతి పర్యావరణ పరిశోధకులు, శ్రీసిటి ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఈ గణనలో పాల్గొన్నారు. పులికాట్ సరస్సు పరిధిలోని శ్రీహరికోట, వేనాడు, పేర్నాడు, ఇరకం రాయదొరువు, మొనపాలెం లాంటి ప్రాంతాల్లో వీరు పర్యటించి పక్షుల జీవనశైలి, అవి గుడ్లు పెట్టి పొదుగుతున్న విధానం, ఆహారం ఎలా తీసుకుంటున్నాయి అనే దానిపై పరిశోధనలు చేశారు.

# తిరుపతి ఐఐటిని సందర్శించిన డల్‌హౌసి బృందం

శ్రీకాళహస్తి,జనవరి 31 ప్రభాతవార్త

తిరుపతి ఐఐటి దశల వారిగా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ప్రత్యేక గుర్తింపు సాధిస్తుందని డైరెక్టర్ ప్రొఫేసర్ సత్యనారాయణ అన్నారు. శనివారం కెనడాకు చెందిన డల్హౌసి విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం సందర్శించారు. వీరు విద్యామరియు పరిశోధన సహకారాన్ని అన్వేషించటానికి వచ్చినట్లు ప్రకటించారు.అధ్యక్షుడు,వైస్ ఛైర్మెన్ డాక్టర్ కింబర్లీ రూత్ బ్రూక్స్ నేతృత్వంలో వచ్చారు. ప్రతినిధి బృందానికి తిరుపతి ఐఐటి ఆతిధ్యం ఇచ్చింది. డల్హౌసి విశ్వవిద్యాలయం అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ (గ్రోబల్ రిలేషన్స్) డాక్టర్ బాలకృష్ణన్ పృధ్వీరాజ్‌తో కలసి రెండు సంస్థల మధ్య విద్యా,పరిశోధన సహకారాన్ని బలోపేతం చేయటంపై విస్తృత స్థాయి చర్చలు జరిగాయి. తిరుపతి నాయకత్వంలో తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రొఫేసర్ కె.ఎన్ సత్యనారాయణ గ్లోబల్ ఎంగేజ్‌మెంట్ ఐఐటి డీన్ ప్రొఫేసర్ శశిధర్ శర్మ గుమ్మల పర్యవేక్షణలో సమావేశం జరిగింది. వివిధ రంగాలకు చెందిన పరిశోధనా డీన్లు, విభాగాధిపతులుఅ ధ్యాపకులు హాజరయ్యారు.విద్యార్థి అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలు ఉమ్మడి డిగ్రీ మరియు సర్టిపికేట్ల కార్యక్రమాలను విద్యార్థుల విద్యా మార్గదర్శకత్వంలో రెండు సంస్థల మధ్య సహకారాన్ని పెంచటంపై చర్చలు జరిగాయి. సహకారం కోసం గుర్తించబడిన కీలక అంశాలలో శక్తి మరియు స్థిరత్వం క్వాంటం సైన్స్,ప్రెసిషన్ అగ్రికల్చరల్ మరియు ఫుడ్ టెక్నాలజీ అప్లైడ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏ1) ఉన్నాయి. ప్రభావంతమైన అంతర్జాతీయ భాగస్వామ్యాలను పెంపొందించటానికి ఆంతర్ విభాగ పరిశోధనలను పెంపొందించటానికి అంతర్ విభాగ పరిశోధనలను ప్రోత్సహించటానికి మరియు విద్యార్థులు అధ్యాపకులకు ప్రపంచ అభ్యసన అవకాశాలలను సృష్టించాటానికి రెండు సంస్థలు తమ పరిపూరకమైన బలాలను ఉపయోగించుకోవటంలో బలమైన ఆసక్తిని వ్యక్తం చేసాయి

# అధికారుల నిరక్ష్యమా... పాలనపై పట్టు తప్పిందా...!

## నిత్యం వివాదాలలో ఎన్ఎస్ యూ.

తిరుపతి విద్య,జనవరి 31 ప్రభాత వార్త.




జాతీయ సంస్కృత వర్సిటీ నిత్యం వివాదాలతో సతమతమవుతోంది. అధికారుల నిరక్ష ్యంతో పాలనపై పట్టుతప్పడమే ఇందుకు నిదర్శనమని ఇటు అధ్యాపకులు,అటు విద్యార్థులు, ఉద్యోగులు వర్సిటీలో పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు. ప్రధానంగా ఇటీవల వర్సిటీ వరుసగా సంచలనం రేపిన సంఘటనలు మరువక ముందే మరో వివాదం తెరపైకి వచ్చింది. హాస్టల్స్ లో ఉన్న విద్యార్థుల భద్రత దృష్ట్యా పలు సంస్కరణలకు వర్సిటీ అధికారులు శ్రీకారం చుట్టారు. వర్సిటీలోని సుమారు 5 బాలుర,బాలికల వసతి గృహాలలో మార్పులు చేయాలని నిర్ణయించారు.ఇందులో భాగంగా గత రెండు రోజుల నుంచి బాలుర వసతి గృహాలను మార్చి బాలికలకు కేటాయించడం, ప్రస్తుతం బాలికలు నివసిస్తున్న వసతి గృహాలను బాలురకు కేటాయించేందుకు చర్యలు చేపట్టారు.వసతి గృహాలలో వాష్ రూమ్లను సైతం తొలగించేశారు. అయితే ఈ విషయంలో విద్యార్థులు అధికారుల తీరుకు నిరసిస్తూ వర్సిటీలో పెద్ద ఎత్తున దర్నాకు దిగారు.దీంతో ఏటూ పాలుపోని అధికారులు విద్యార్థులకు నచ్చచెప్పి ఏవరి వసతి గృహాలను వారికే కేటాయిస్తామంటూ హామీ ఇవ్వడంతో విద్యార్థులు దిగివచ్చి నిరసన కార్యక్రమాన్ని విరమించుకున్నారు.గ్రూప్ రాజకీయాలే కొంపముంచుతున్నాయా...!సెంట్రల్ వర్సిటీగా గుర్తింపు పొందిన ఎన్ఎస్‌యులో అసలు ఏమి జరుగుతోంది.వివాదాలతో సతమవుతున్న వర్సిటీలో అధ్యాపకుల గ్రూప్ రాజకీయాలే కారణమా.. లేక అధికారులు పాలనపై పట్టు సాధించలేకపోతున్నారా అనే అనుమానం వ్యక్త మవుతోంది. అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు కొందరు బోధనేతర సిబ్బందికి నచ్చకపోవడంతో తెరవెనుక రాజకీయాలు నడుపుతూ వర్సిటీ అంతరంగిక విషయాలను సైతం బయట పెడుతున్నారని మరో వర్గం ఆరోపణలు చేస్తోంది.విద్యార్థులను సైతం ప్రేరేపించి వర్సిటీ అధికారులపై నిరసన గళం వినిపించేందుకు ప్రోత్సహిస్తున్నారని అధికారులు ఆవేధన వ్యక్తం చేస్తున్నట్లు తెలుసుస్తోంది. ఏది ఏమైనా గ్రూప్ తగాదాలకు చరమగీతం పాడకుంటే వర్సిటీ పరవు పోతుందని ఉద్యోగులు, పండితులు చర్చించుకోవడం కొసమెరుపు.

## అంబటి రాంబాబు పై ఫిర్యాదు



**పుంగనూరు రూరల్ జనవరి 31 (ప్రభాతవార్త)** మాజీ మంత్రి అంబటి రాంబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై చర్య తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ శ్రేణులు శనివారం సాయంత్రం పుంగనూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు నాయుడు పై అంబటి రాంబాబు నోటికి వచ్చిన విధంగా దుర్భాషలాడటం సోషియల్ మీడియాలో రావడం పట్ల తాము స్పందిస్తున్నామని తెలిపారు. అంబటి రాంబాబు పై రాజంపేట పార్లమెంట్ ఐటీడీపీ కార్యదర్శికుమార్తెలుగుదేశంనాయకులు చంద్రశేఖర్ ప్రసాద్ గోపికృష్ణ సతీష్ మణికంఠ ఫిర్యాదు చేశారు.

## వయస్సుకు విలువ ఇచ్చి మాట్లాడు రాంబాబు



**కల్లూరు, జనవరి 31, ప్రభాతవార్త** ముఖ్యమంత్రి చంద్రబాబు పైన మానవతా దృక్పథం లేకుండా మాటలు పారేసుకున్న వైఎస్ఆర్సీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు మాటలను వయసుకు విలువ ఇవ్వకుండా రాజకీయాలకు అతీతంగా మాట్లాడడం చాలా బాధాకరం అని పోసంవారిపల్లి పంచాయితీ వాటర్ షెడ్ చైర్మన్ ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామచంద్ర రెడ్డి ఆదేశనుసారం పులిచేర్ల మండలం పోసంవారి పల్లి పంచాయితీ వాటర్ షెడ్ ఛైర్మెన్ ప్రభాకర్ తెలియజేసారు.

## ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ



**చిత్తూరురూరల్, జనవరి 31 ప్రభాతవార్త:** చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ఆదేశాల మేరకు ఒక రోజు ముందుగానే పెన్షన్దారులకు సచివాలయ సిబ్బందితో కలసి శనివారం ఉదయమే పింఛన్లను పంపిణీ చేసినట్లు 37వ డివిజన్ భాజపా ఇన్ఛార్జీ షణ్ముగం తెలిపారు. డివిజన్ పరిధిలో వృద్దులు, వితంతువులు, వికలాంగులకు సచివాలయ అడ్మిన్తో కలసి ఇంటింటికి వెళ్లి ఫించన్లను అందించారు. కార్యక్రమంలో షణ్ముగంతో పాటు కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్దారుల కళ్లలో ఆనందమే కూటమి ప్రభుత్వలక్ష్యం



**చిత్తూరురూరల్, జనవరి 31 ప్రభాతవార్త:** పెన్షన్దారుల కళ్లల్లో ఆనందమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యేయమని, ఆయన అడుగుజాడల్లో చిత్తూరు నియోజకవర్గ శాసనసభ్యులు గురజాల జగన్మోహన్కు నడుస్తున్నారని, పెన్షన్దారులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యం కలగకుండా పెన్షన్లు అందిస్తున్నామని టిడిపి 32వ డివిజన్ అధ్యక్షురాలు హేమావతి తెలిపారు. శనివారం ఎమ్మెల్యే ఆదేశానుమేరకు పెన్షన్దారులకు సచివాలయసిబ్బంది, కూటమి నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు అడ్మిన్ కార్యదర్శి యోగేశ్వర్, సచివాలయ సిబ్బంది, నాయకులు రవికుమార్, త్రిమూర్తినాయుడు, కరీం, సోమశేఖర్, విజయ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంచే డిజిటల్ గ్రంథాలయం ప్రారంభం



**కుప్పం, జనవరి 31 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుప్పం పట్టణం బైపాస్ రోడ్లో నూతనంగా ఏర్పాటుచేసిన డిజిటల్ గ్ర ంథాలయం, గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రంథాలయాన్ని పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. గ్రంథాలయాలువిజ్ఞాన కేంద్రాలనివీటిని పిల్లలు సద్వినియోగంచేసుకోవాలనిసిఎం వారికి సూచించి అనంతరం పిల్లల కోరిక మేరకువారితో ఫోటో దిగారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ



**పెనగలూరు జనవరి 31ప్రభాతవార్త** రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టియు )రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి ఆదినారాయణ రెడ్డి ఆర్థిక సహకారంతో పెనగలూరు మండలంలో పెనగలూరు, నల్లపురెడ్డి పల్లి,కొండూరు, ఎన్. ఆర్. పురం ,నాయుడువారిపల్లి,చంద్రంపేట, కట్టవారిపల్లి ఉన్నత పాఠశాలలు మరియు కే. జీ.బీ.వీ పెనగలూరు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు, ఎస్ టి యు ఆంధ్ర రాష్ట్ర ఆధ్వర్యంలో, నిష్ణాతులైన ఉపాధ్యాయులచే తయారు చేయబడిన స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అల్లం మహేశ్వర నాయుడు, కె.కృష్ణమూర్తి,ఐ.జి. బాబు, లేబాకు గోపాలకృష్ణ,బి.రమణయ్య ,పి. వెంకటసుబ్బయ్య, పిచ్చయ్య తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలతో పాటు, ప్రభుత్వ పాఠశాల ల పరిరక్షణ కొరకు, విద్యార్థుల అభివృద్ధి, సంక్షేమం కొరకు చిత్తశుద్ధితో కృషిచేస్తున్న ఎస్ టి యు నాయకులు అభినందనీయులని కొనియాడారు. ఈ సందర్భంగా దాత ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ, పై ఏడు మండలంలో పదో తరగతి పరీక్షల్లో 597 మార్కులు సాధించిన విద్యార్థులందరికీ, ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున నగదు బహుమతి ఇస్తానని ప్రకటించారు. రాష్ట్ర కార్యదర్శి అల్లం అశోక్ కుమార్ మాట్లాడుతూ, గడ్డం ఆదినారాయణ రెడ్డి సుమారు మూడు లక్షల రూపాయల వ్యయంతో తెప్పించిన స్టడీ మెటీరియల్ ను విద్యార్థులందరూ చక్కగా ఉపయోగించుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆదినారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రోపాధ్యా సంఘం రాష్ట్ర కార్యదర్శి అల్లం అశోక్ కుమార్,అన్నమయ్య జిల్లా పూర్వ అధ్యక్షుడు పిల్లి రామకృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్లు జీ. శ్రీనివాసులు, యానాదయ్య, పూర్వ రాష్ట్ర కౌన్సిలర్ పీ. యల్లయ్య, కోడూరు రీజినల్ కన్వీనర్ రవిశంకర్ రెడ్డి, తిరుపతి జిల్లా నాయకులు రాఘవ రెడ్డి, శివారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సురేంద్ర, పెనగలూరు మండల అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున, రాము, ఆర్థిక కార్యదర్శి శివప్రసాద్, నాయకులు జయ రామయ్య, శేషారెడ్డి, శ్రీనివాసులు, వేణుగోపాల రెడ్డి, బాదుషా, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు

## ప్రతి పౌరుడు హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

**ఓబులవారిపల్లి, జనవరి 31 ప్రభాతవార్త** భారత రాజ్యాంగం కల్పించిన పౌరుహక్కులు గురించి ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని ఓబులవారిపల్లి ఎస్సై మహేష్ బాబు సూచించారు తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలం నూకనపల్లి ఎస్టీ కాలనీలో ప్రజలకు హక్కులు చట్టాల పైన తాసిల్దార్ యామిని అధ్యక్షతన అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు రేణిగుంట డి.ఎస్.పి శ్రీనివాసులు సూచనల మేరకు చట్టాల పైన అవగాహన కల్పిస్తున్నామన్నారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు చట్టాలపై ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు ఏవైనా గ్రామాల్లో ఇబ్బందులు ఉన్న బెదిరింపులకు పాల్పడిన చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన అటువంటి వారిపైన తగిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో వీఆర్వో శంకరయ్య ఆరే మల్లికార్జున గ్రామ ప్రజలు పెద్దలు పోలీస్ సిబ్బంది పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

# రైల్వే కోడూరు డివిజన్

## రాంబాబు నోరు అదుపులో పెట్టుకో



**రైల్వేకోడూరు, జనవరి 31 ప్రభాతవార్త** అంబటి రాంబాబు మా ముఖ్యమంత్రి చంద్రబాబుపై నోరు జారితే నాలుక కోస్తామని రైల్వే కోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర సుపరిపాలన దక్షులు నారా చంద్రబాబు నాయుడు మర్యాదకు క్రమ శిక్షణకు మారుపేరుగా ప్రపంచ దేశాలు పొగుడుతున్నాయని వైసీపీ పరిపాలనలో అక్రమ సంపాదనతో మదం పట్టి మాట్లాడుతున్నావని ఇది సరైన పద్ధతి కాదని ఆయన రాంబాబుపై నిప్పులు చెరిగారు. భవిష్యత్తులో మా ముఖ్యమంత్రిపై ఎవరైనా అసభ్య పదజాలం వాడితే సరైన పని చేస్తామని ముక్కారూపనంద రెడ్డి హెచ్చరించారు.

## ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు సదస్సు

రైల్వేకోడూరు, జనవరి 31 ప్రభాతవార్త



...యతీ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన ...చిన శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాల అనంతపురం ...మండలంలోని ఓవనపల్లి గ్రామంలో రైతు సదస్సు, ...నికి ఉద్యయన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ...ఖ్య అతిథిగా పాల్గొని రైతులకు చక్కటి సూచనలను, ...వరాజు మాట్లాడుతూ రైతు సోదరులు పంట వేసుకునే ...నేల సారాన్ని పెంపొందించుకోవచ్చని అధిక దిగుబడి సాధించుకోవచ్చు అని అన్నారు. అదేవిధంగా సూచించిన మేరకే ఎరువులను, పురుగుమందులను వినియోగించుకోవాలని సూచించారు. మరో శాస్త్రవేత్త సందీప్ నాయక్ మాట్లాడుతూ బొప్పాయి, అరటి మరియు మామిడి పంటల్లో ప్రస్తుతం చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు మరియు చీడపీడల సస్య రక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బసవరాజు, నర్సి రెడ్డి, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారు రైతులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో వీధి కుక్కల బెడదను నివారించాలి



**ఐరాల, జనవరి 31 ప్రభాతవార్త:** మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో కుక్కల బెడదను నివారించాలని పలువురు సభ్యులు డిమాండు చేశారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ చింతం మోహన్ అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా వుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వీధి కుక్కల కారణంగా గ్రామాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. దీనితో ఎంపీపీ మాట్లాడుతూ వీధి కుక్కల బెడదను నివారించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని, వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషను చేయించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో సర్పంచ్లు చొరవ తీసుకుని కుక్కలను పట్టిస్తే వాటికి కు.ని ఆపరేషన్లు చేస్తామని మండల సశు వైద్యాధికారి డాక్టర్ పినాకి పాకిని తెలిపారు. గ్రామాల్లో ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ వీధి కుక్కలకు ఎవ్వరూ తిండి పెట్టకుండా సహకరించాలని కాణిపాకం ఎంపీహెచ్ ఈఓ వి.శివయ్య తెలిపారు. ఈసమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్రెడ్డి, తహశీల్దార్ లోకేశ్వరి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్లు,గ్రామ కార్యదర్శులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మానవ హక్కుల పరిరక్షణకు సమావేశం



**బైరెడ్డిపల్లి, జనవరి 31 ప్రభాతవార్త** మానవ హక్కుల పరిరక్షణలో భాగంగా శనివారం బైరెడ్డిపల్లి మండలం తడకట్లపల్లి గ్రామంలో బలహీనవర్గాల వారితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ దామోదరచారి అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో అక్కడి ప్రజలతో చర్చించి వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అంటరానితనం, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సచివాలయ వీఆర్వో శ్రవణ్ కృపా వాడి వీఆర్ఏ బోయకొండ ఏపీఓలు పాల్గొన్నారు.

## కుష్టి వ్యాధిపై అవగాహన సదస్సు

రామకుప్పం, జనవరి 31 ప్రభాతవార్త

:మండల పరిధిలోని విజలాపురం ప్రాథమిక ఆసుపత్రి ఆధ్వర్యంలో కుష్టివాదిపై ప్రజలకు అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. శనివారం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది కుష్టి వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా శరీరం పైన స్పర్శ లేని మచ్చ ఉంటే కుష్టి వ్యాధి ఉండవచ్చు అని , ఏ విధమైన అనుమానం ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలన్నారు.31 జనవరి నుండి ఫిబ్రవరి 13 వరకు కుష్టి వ్యాధి అవగాహన శిబిరాలు జరుగుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే చికిత్సలు పూర్తిగా ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఆక్సిడెంట్ బాలు, ప్రమీల, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీవారికి వైఎస్ జగన్ క్షమాపణలు

**గుడిపాల, జనవరి 31 ప్రభాతవార్త:** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామికి వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి క్షమాపణాలు చెప్పాలని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు డిమాండ్ చేశారు. వైకాపా అధికారంలోకి వున్నప్పుడే తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని సిట్ అధికారులు నిర్ధారించినప్పటికీ వైకాపా నాయకులు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా వుందన్నారు. తమ పాలనలో కల్తీ జరిగిన విషయం కప్పిపుచ్చుకోవడం కోసం డైవర్షన్ పాలిటిక్స్తో భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని, కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి పెట్టుకున్న వారు కాలగర్భంలో కలసిపోతారన్నారు. వైకాపా పాలన మొత్తం రాష్ట్రంను లూటీ చేయడమే ప్రధాన అజెండాగా సాగిందని ఆయన పేర్కొన్నారు.

## అభివృద్ధి ప్రభుత్వ అజెండా



**పెనుమూరు, జనవరి 31 ప్రభాతవార్త:** అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ అజెండా అని మండల తెలుగుదేశం అధ్యక్షులు పెద్దినేని రుద్రయ్యనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం లబ్దిదారులకు ఈ-సైకిళ్ళను మండల తెలుగుదేశం అధ్యక్షులు రుద్రయ్యనాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నిరుపేద లబ్దిదారులకు సబ్సిడీపై రూ.13.39 లక్షలు విలువ చేసే 60 సైకిళ్ళను 60 మంది లబ్దిదారులకు పంపిణీ చేయడం జరిగింద ˆన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సిఎం నారా చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని, అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి శ్రీరామ రక్ష అన్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, అయితే సిఎం నారా చంద్రబాబునాయుడు ఆర్థిక పరిస్థితులను గాడిలో పెట్టి అభివృద్ధి, సంక్షేమంను రెండు కళ్ళుగా చేసుకుని రాష్ట్రంను ప్రగతి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నీలకంఠేశ్వరరెడ్డి, సింగిల్విండో ఛైర్మన్ పామూరు శ్రీనివాసులు, తెలుగుదేశం నాయకులు తలారి రెడ్డప్పనాయుడు, గుర్రప్పనాయుడు, నిరంజన్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భ్రమరాంభిక సహిత మల్లికార్జున స్వామికి త్రయోదశి పూజలు



**కల్లూరు, జనవరి 31, ప్రభాతవార్త** పులిచెర్ల మండలం త్రయోదశి సందర్భంగా శ్రీ భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. పులిచెర్ల వాస్తువులని హేమలత, నరేష్, సురేష్ వాళ్ళ కుటుంబ సభ్యులు స్వామి వారికి రుద్రాభిషేకం విశేషాలనుకారం నిర్వహించారు. అనంతరం నరేష్ కుమార్తెకి వికాస్ అనే నామకరణం చేస్తూ అన్నదానం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తాదులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## అంబటి రాంబాబును కఠినంగా శిక్షించాలి



**కల్లూరు, జనవరి 31, ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై అసభ్య పదజాలంతో దూషించిన వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబును కఠినంగా శిక్షించాలని పులిచెర్ల మండలం టిడిపి నాయకులు మోహన్ దాస్ డిమాండ్ చేశారు. కల్లూరులో శనివారం మోహన్ దాస్ మాట్లాడుతూ రాజకీయాలలో విలువలు లేని అంబటి రాంబాబు, రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును దూషించడం, నీతి మాలిన చర్యని అన్నారు. అంబటి రాంబాబు రోడ్లపై కనబడితే టిడిపినాయకులుకార్యకర్తలుతరిమితరిమికొట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

## పోశంవారిపల్లెలో పశు వైద్య శిబిరం

**కల్లూరు, జనవరి 31, ప్రభాతవార్త** పులిచర్ల మండలం పోశంవారిపల్లెలో పశు వైద్య శిభి రం నిర్వహించారు. ఎల్లంకివారిపల్లి పశు వైద్యాధికారి శ్రీహరి ఆధ్వర్యంలో పశువులకు దాదాపు 96 ఆవులకు, గోమ్మార్లు, 32 దూడలకు నట్టల నివారణ, 26 ఆవులకు గర్భకోశ వ్యాధి చికిత్స చేసారు. ఈ కార్యక్రమంలో రైతులు జయచంద్రయ్య, పాడి రైతులు, సిబ్బంది హరి, అరుణ బాబు పాల్గొన్నారు.

## కామిశెట్టినగర్కు రూ.20 లక్షలతో రోడ్డు పనులకు భూమి పూజ:



**రైల్వేకోడూరు, జనవరి 31 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైల్వేకోడూరు నియోజకవర్గానికి మహర్దశ పట్టిందని రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానందరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్క పంచాయతీలో అవసరం ఉన్న చోట సిమెంటు రోడ్లను వందలాదికోట్లతో వేస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని చోట్ల తాగునీరు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా అన్ని ప్రాంతాలలో సిసి రోడ్లు వేస్తున్నామని అన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి చేపట్టలేదని కేవలం మాయమాటలతో, తల్లి బుల్లి తో కాలయాపన చేయడం తప్ప అభివృద్ధి శూన్యమని అన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి ధ్యేయంగా పనిచేసి ప్రజల మన్ననలను పొందుతున్నామని అన్నారు. కోడూరు ప్రజల ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజల రుణంను తీర్చుకుంటున్నామని ఆయన అన్నారు. శనివారం కోడూరు పట్టణంలోని కామిశెట్టి నగరం నందు 20 లక్షలతో సిమెంట్ రోడ్డును వేసి ఇక్కడ ప్రజల సౌకర్యార్థం కోసం పనిచేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పోకల సుబ్రహ్మణ్యం (మణి ), పటాన్ మోలా, తిమ్మిశెట్టిపల్లి మనీ, అద్దిపల్లి వెంకటరామరాజు, పంచాయతీరాజ్ డిఇ బాల నరసింహులు, మల్లికార్జున రెడ్డి, కొప్పరపు అరవింద్, ఉంగరాల బ్రదర్స్, శివ తో పాటు కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గడువుకు ముందే ఎన్టీఆర్ భరోసా పంపిణీ

చిట్వేలి, జనవరి 31 ప్రభాతవార్త:



గడువుకు ముందే ఎన్టీఆర్ భరోసాను లబ్ధిదారులకు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని టిడిపి మండల బాధ్యుడు కాకర్ల నాగార్జున అన్నారు. శనివారం చిట్వేలి గ్రామంలోనూ, నగిరిపాడు గ్రామ పంచాయతీలో పింఛన్ల పంపిణీలో కాకర్ల నాగార్జున పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా అందించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్లను అర్హుల ఇంటి వద్దకు వెళ్లి అధికారులు అందించడంతో అవ్వ తాత కళ్ళల్లో ఆనందం రెట్టింపు అయిందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు కొండా వెంకటేష్, సీనియర్ నాయకులు బాలు రామాంజనేయులు, క్లస్టర్ ఇంచార్జ్ బుంగ టావుల రాజశేఖర్, గ్రామ పార్టీ అధ్యక్షులు కస్తూరి దివాకర్, యూనిట్ కో ఇంచార్జ్ గూడూరు సుబ్బరాజు, ఎస్ సి సెల్ అధ్యక్షులు పెంచలయ్య, సచివాలయం సిబ్బంది మరియు లబ్ధిదారులు పాల్గున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గిరిజన బాలుడికి వైకాపా అండ



**పుంగనూరు, జనవరి 31 ప్రభాతవార్త** సుగాలు మెట్టలో గత నాలుగు రోజులు క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్వేష్ నాయక్ అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం బాలుడిని కోలార్ నందు చేర్పించగా మూడు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు వెల్లడించారు. దీంతో సుగాలి మిట్ట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందుకు కదిలారు. వైఎస్ఆర్సిపి పార్టీ 60 వేల రూపాయలు ఆర్థిక సాయం వారి యొక్క కుటుంబ సభ్యులకు అందజేశారు. వైఎస్ఆర్సిపి నాయకులు చెంగారెడ్డి 25 వేల రూపాయలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి గిరిజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాణావత్ మునీంద్ర నాయక్, సుగాలి మిట్ట సర్పంచ్ దేవమ్మ, నలుగుట్టపల్లి సర్పంచ్ శ్రీనివాసులు నాయక్, మాజీ సర్పంచ్ రామయ్య, నలుగుటపల్లి వైఎస్ఆర్సిపి అధ్యక్షులు దాబా శీను నాయక్, యూత్ ప్రెసిడెంట్ మనోజ్ కుమార్ నాయక్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పర్యావరణ హితుడు సిఎం చంద్రబాబు



**చౌడేపల్లి, జనవరి 31 ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యావరణ హితుడని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్రెడి (చిట్టి)అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో లబ్దిదారులకు ఈ-సైకిళ్ళను పంపిణీ చేసారు. వీటివల్ల ప్రజలకు శరీర, మానసిక ఆరోగ్యంతోపాటు పర్యా వరణ పరిరక్షణ జరుగుతుందన్నారు.ఈ-సైకిళ్ళను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపిడిఓ లీలామాధవి, ఎపిఎం సుబ్రమణ్యం, తేదేపా నాయకులు పూల చంద్రమౌళి, పంజాణిపల్లి బాబు నాయుడు,పవన్కుమార్,విజయభాస్కర్రెడ్డి,సోము,ప్రభాకర్,అర్జున్రాయల్, వెలుగుసిసిలు,పాల్గొన్నారు.

## స్కూటర్ ఢీకొని బాలికకు గాయాలు



**చౌడేపల్లి, జనవరి 31 ప్రభాతవార్త** స్కూటర్ ఢీకొని బాలికకు తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ గాండ్లపల్లికి చెందిన శ్రావ్య(8) తన తల్లిదండ్రులతో సొంత పనులు నిమిత్తం చౌడేపల్లికి వచ్చి మరలా సొంత గ్రామానికి బస్సులో బయలుదేరింది. చారాల స్టేజీ వద్ద బాలిక దిగి రోడ్డు దాటుతుండగా స్కూటర్ ఢీకొన్నది. ఈప్రమాదంలో బాలిక కాలికి బలమైన గాయమైంది. శ్రావ్యను స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాలిక ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 108సేవల ద్వారా మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## పుదిపట్లలో పశువుల దాణా పంపిణీ

చౌడేపల్లి, జనవరి 31 ప్రభాతవార్త

మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్లలో పశువుల దాణా పంపిణీ చేసారు. మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్రెడ్డి(చిట్టి) ఆధ్వర్యంలో పశువైద్యాధికారి రైతులకు దాణాను అందించారు. పుదిపట్ల ఏరియాకు సంబంధించి 105బస్తాలు మంజూరు అయ్యాయనీ, అదే విధంగా 69గడ్డికోసే యంత్రాలు వచ్చాయన్నారు. ప్రభుత్వమందించే రాయితీ పోను రైతులు దాణాకు రూ. 550లు, గడ్డిని కోసే యంత్రం రూ. 20,250లకు అందిస్తున్నట్లు వివరించారు. తిరుమణిపల్లి రాజారెడ్డి, పూల చంద్రమౌళి, పంజానిపల్లి బాబునాయుడు, పవన్కుమార్, విజయభాస్కర్రెడ్డి, సోము, ప్రభాకర్, అర్జున్రాయల్, పంచాయతీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు



**సోమల, జనవరి 31 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందిస్తున్నట్లు సోమల పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షులు ఎస్ఎస్ భాష అన్నారు. శనివారం వృద్ధులు వితంతువులకు పెన్షన్లు అందించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అలాగే మండలంలోని 15 పంచాయతీల్లోనూ ఆయా పంచాయతీలోని నాయకుల ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది పెన్షన్లు పంపిణీ కార్యక్రమం పూర్తి చేశారు

## ఎస్సీల పట్ల వివక్ష చూపితే కఠినమైన చర్యలు



**సోమల,జనవరి 31 ప్రభాతవార్త** ఎస్సీ ఎస్టీలపై వివక్ష చూపితే వారికి కఠినమైన శిక్షలు పడే అవకాశం ఉందని తాసిల్దార్ మధుసూదన్ అన్నారు. శనివారం తమ్మి నాయన పల్లి పంచాయతీ లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ సురేందర్ రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. గ్రామస్తులు స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని కోరడంతో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు గ్రామంలో విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలని ప్రజల కోరారు. అలాగే గ్రామ కంఠంలో ఆక్రమణలు ఉన్నాయని వాటిని తొలగించాలని కోరారు వీఆర్వో రెడ్డమ్మ, గ్రామ కార్యదర్శి మురళీకృష్ణ, రత్నయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు

## కాణిపాకం ఆలయానికి రెండు టన్నుల కూరగాయలు విరాళం



**కాణిపాకం, జనవరి 31 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంకు భక్తులు శనివారం రెండు టన్నుల కూరగాయలను విరాళంగా అందజేశారు. దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం అమలు జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి పలమనేరుకు చెందిన యుగంధర్, ప్రజన్న అనే భక్తులు రెండు టన్నుల కూరగాయలను విరాళంగా అందజేశారు. వీటిని అన్నదాన భవన్ వద్ద ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్కు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఏఈఓ హరిమాధవరెడ్డి, సూపరెండెంట్ బాలరంగస్వామి, అన్నదాన భవన్ ఇన్చార్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి



**కాణిపాకం, జనవరి 31 ప్రభాతవార్త:** కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజి.ఉమ కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరెండెంట్ వాసు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్ధగిరిలో వైభవంగా పౌర్ణమి వేడుకలు

**తవణంపల్లె, జనవరి 31 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి



దేవ స్థానంలో శనివారం పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆల యంలో పౌర్ణమి వేడుకలు నిర్వ హించడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయ ఈఓ ఇ.ముని శేఖర్ ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు ఉదయం స్వామి వారి మూలవిరాట్కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు.

## తీర్థం పిహెచ్సిను పర్యవేక్షించిన జిల్లా ఆరోగ్య అధికారులు

**బైరెడ్డిపల్లి, జనవరి 31 ప్రభాతవార్త** బైరెడ్డిపల్లి మండల తీర్థం పంచాయతీ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారులు పర్యవేక్షి ంచారు. డాక్టర్ వెంకటప్రసాద్,లెప్రసీ,టిబి ప్రోగ్రాం ఆఫీసర్,డాక్టర్ హనుమంతరావు,జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్,డాక్టర్ అనిల్ కుమార్,డీఎస్ఓలు శనివారం ఆరోగ్య కేంద్రాన్ని పర్యవేక్షి ంచి,మండల ఆరోగ్య అధికారులు, వైద్య సిబ్బందికి సలహాలు సూచనలు చేయడం జరిగినది. డాక్టర్ పద్మావతి, ఫార్మసిస్ట్ అయూబ్,ఎస్ ఎన్ రెడ్డమ్మ పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబును అంబటి విమర్శించడం తగదు...

ఓబులవారిపల్లి, జనవరి 31 ప్రభాతవార్త



వైసీపీ సీనియర్ నాయకులు అంబటి రాంబాబు ఆంబోతుల ప్రవర్తిస్తూ సీఎం చంద్రబాబు నాయుడును స్థాయి మరిచి మాట్లాడడం తగదని రైల్వే కోడూరు టిడిపి యువ నాయకులు. ముక్కా సాయి వికాస్ రెడ్డి ఖండించారు. ఆయన మాట్లాడుతూ మతిస్థిమితం లేని పిచ్చివాడిలా ప్రవర్తిస్తూ అంతటి పెద్ద మనిషిని గౌరవ వృత్తిలో ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు ని దుర్భాషలాడటం. శునకానందం పొందడేమనన్నారు. ప్రజలే అంబటి రాంబాబుకు గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. మా నాయకుడిని దుర్భాషలాడితే సహించేది లేదని ఎంతటి వారికైనా చట్టబద్ధంగా శిక్షపడుతుందని ఆయన హెచ్చరించారు ఇలాంటి మాటలు మానుకొని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నాయుడుపేట, జనవరి 31 ప్రభాతవార్త: మున్సి పాలిటీ పరిధిలోని 14వ వార్డులో నిర్వహించిన పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ ఇంటింటికి వెళ్లి పెన్షన్ దారులకు పెన్షన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ 1వ తేదీ సెలవు దినాలు వస్తే పెన్షన్ దారులు ఇబ్బందులు పడకూడదన్న ఆలోచనతో ముందు రోజే పెన్షన్ నగదును అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా పెన్షన్ నగదును అందించడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ జెండా కడితే ప్రభుత్వ పథకాలను అందించేవారు కాదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, నాయకులు పసల గంగాప్రసాద్, గూడూరు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, పొట్లపూడి రాజేష్, సుజాతమ్మ, రేవతి తదితరులు దేశం నాయకులు పాల్గొన్నారు.

## పట్టణ టిడిపి అధ్యక్షుడిగా ఆకుతోట రమేష్



సూళ్లూరుపేట, జనవరి 31 ప్రభాతవార్త: పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఆకుతోట రమేష్ ఎన్నికైనట్లు పార్టీ అధిష్టాన వర్గం శనివారం వెల్లడించింది. ఆకుతోట రమేష్ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని కలిసి తనకు పార్టీ అధ్యక్ష పదవిని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎఎంసి ఛైర్మన్‌గా పదవి బాధ్యతలు నిర్వహిస్తున్నా నని, తిరిగి రెండవ పర్యాయం తనపై నమ్మకం ఉంచి పార్టీ పట్టణ అధ్యక్షునిగా నియమించడం సంతోషంగా ఉందని తెలిపారు. పార్టీ మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంలకు రమేష్ ధన్యవాదాలు తెలిపారు.

## మెగా రక్త పరీక్షలకు అనూహ్య స్పందన



వాకాడు, జనవరి 31 ప్రభాతవార్త: పంచాయతీ పరిధిలోని గొల్లపాలెం ఆఫ్ వాకాడు ఎంపీపీ పాఠశాలలో శనివారం కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎం.వి. రావు ఫౌండేషన్ 18వ వార్షికోత్సవ సందర్భంగా ఉచిత నేత్ర వైద్య శిబిరంను ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ ఏర్పాటు చేశారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త తెలుగుదేశం సీనియర్ నాయకులు సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, ఎంఈఓలు ఆనంద్, నసీం ఆలీ, వాకాడు ఏంసి స్కూల్ ప్రధానోపాధ్యాయులు జాలాది కిషోర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంవి రావు ఫౌండేషన్ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గొల్లపాలెం ఆఫ్ వాకాడులో నేత్ర వైద్య శిబిరం, బిపి రక్త పరీక్షలు చెవి పరీక్షలకు అవసరమైన పరీక్షలను గొల్లపాలెం వాసులకు ఉచితంగా చేయడం అభినందనీయమని వారు అన్నారు. ఈ శిబిరానికి వాకాడు, గొల్లపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు అనూహ్యంగా స్పందించి ప్రజలు తరలివచ్చారు. అనంతరం నెల్లూరు వాసన్ ఐ కేర్ మరియు కోట పట్టణానికి చెందిన రమేష్ ఐ కేర్ నేత్ర వైద్య నిపుణులు వి.రమేష్ నేతృత్వంలో శిబిరానికి హాజరైన కంటి సమస్యలతో బాధపడే వారికి ఉచితంగా కంప్యూటర్ పరీక్షలు నిర్వహించి, దృష్టిలోపం ఉన్న వారిని గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. మేరీ సునీత, ఏ.విజయలక్ష్మి, వాకాడు ముస్లిం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలాది కిషోర్, రమేష్ ఐ కేర్ వైద్యులు వి రమేష్, వారి సిబ్బంది ఎంవీ రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ముప్పవరపు విజయలక్ష్మి, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశంపార్టీ పట్టణ అధ్యక్షుడిగా రఫీ నియామకం



నాయుడుపేట, జనవరి 31 ప్రభాతవార్త: నాయుడుపేట తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడుగా 786 రఫీని నియమిస్తూ పార్టీ అధిష్టానం ప్రకటన విడుదల చేసింది. శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుండి దేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు విడుదల చేసిన జాబితాలో నాయుడుపేట పట్టణ పార్టీ అధ్యక్షుడిగా 786 రఫీ నియమించడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు 786 రఫీ మాట్లాడుతూ తన మంచి కోరే వ్యక్తి కొండేపాటి గంగా ప్రసాద్ ఆశీర్వాదం సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ దేశం పార్టీ పెద్దలు నెలవల సుబ్రహ్మణ్యం సహకారంతోనే తాను పార్టీ అధ్యక్షుడిగా నియమితులైనానని అన్నారు. నాయుడుపేట ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తానని అన్నారు.

## పెన్షన్లతో అవ్వ తాతలకు ఆర్థిక భరోసా



నాయుడుపేట, జనవరి 31 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లు అవ్వ తాతలకు ఆర్థిక భరోసా ఇస్తున్నాయని తెలుగుదేశం పార్టీ నాయకులు బల్లి ముత్యాలయ్య అన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆదేశాల మేరకు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సూచనలతో శనివారం నాయుడుపేట మండలంలోని పెరికలంపాటి కండ్రిగ గ్రామంలో ఆయన ఎన్టీఆర్ సామాజిక పెన్షన్‌లు పంపిణీ చేశారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



సూళ్లూరుపేట, జనవరి 31 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని సాయినగర్, షిరిడీ సాయినాథుని ఆలయ పాలకవర్గ సభ్యులు ఇందూరు రమణారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం సాయినగర్ గిరిజన కాలనీలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందూరు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

తడ, జనవరి 31 ప్రభాతవార్త: మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ జోరుగా సాగింది ఫిబ్రవరి ఒకటవ తేదీన ఆదివారం కావడంతో ముందుగానే శనివారం పెన్షన్లు పంపిణీ చేశారు. అండగుండాల గ్రామంలో టిడిపి నేత పర్వతరెడ్డి కోటీశ్వర్ రెడ్డి, సచివాలయం సిబ్బందితో కలిసి పెన్షన్ లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు.

## సామాజిక పెన్షన్లతో ఆర్థిక భరోసా

నాయుడుపేట, జనవరి 31 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లు అవ్వ తాతలకు ఆర్థిక భరోసా ఇస్తున్నాయని తెలుగుదేశం పార్టీ నాయకులు కాపులూరు చక్రపాణి అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆదేశాల మేరకు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సూచనలతో శనివారం నాయుడుపేట మండలంలోని కాపులూరు గ్రామంలో ఆయన ఎన్టీఆర్ సామాజిక పెన్షన్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సునీత, అగ్రికల్చరల్ అసిస్టెంట్ భావని, తదితరులు ఉన్నారు.

## విద్యార్థి దశనుండే రైతులకు విరివిగా సేవలందించాలి



వెంకటగిరి, జనవరి 31 ప్రభాతవార్త: విద్యార్థి దశనుండే రైతులకు సేవలందించాలని తిరుపతి జోన్ ఎడిట్ డాక్టర్ తెలిపారు. వెంకటగిరిలోని నిమ్మ చీని పరిశోధన కేంద్రంలో రూరల్ ఆర్టికల్చర్ ప్రోగ్రాంలో భాగంగా 4నెలల పాటు శ్రీకృష్ణదేవరాయ ఉద్యానవనం విద్యార్థులు శిక్షణ పొందారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన వర్క్ షాప్‌లో ఆయన పాల్గొన్నారు. నిమ్మ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎం రామయ్య మాట్లాడుతూ విద్యార్థులకు తీరి పరిజ్ఞానం ప్రాక్టికల్‌గా అన్ని చేస్తే అనుభవం వస్తుందని. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్యాంసుందర్ రెడ్డి, ఈకే నాయక్, ఉద్యానవన శాఖ అధికారి ఆనంద రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, ఏఎంసీ డైరెక్టర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అంబటి వ్యాఖ్యలు జుగుప్సాకరం : ఎమ్మెల్యే రామకృష్ణ



వెంకటగిరి, జనవరి 31 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అవాకులు చవాకులు పేలితే తీవ్ర పరిణామాలు తప్పవని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. గుంటూరులో వైసీపీ నేత అంబటి రాంబాబు ముఖ్యమంత్రిపై వాడిన భాషను తీవ్రంగా ఖండించిన ఆయన వైసీపీ నేతల వ్యాఖ్యలు జుగుప్సాకరంగా ఉన్నాయని మండిపడ్డారు. శనివారం రాత్రి వెంకటగిరిలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేక బయటచేరి సీఎంపై అవాకులు చవాకులు పేలితే ఊరుకోనేది లేదని అన్నారు.

## కండక్లర్టకు ఘన సన్మానం



వాకాడు, జనవరి 31 ప్రభాతవార్త: డిపోలో సుదీర్ఘ కాలంగా కండక్టర్లుగా పని చేసి ఏడిసిగా ప్రమోషన్ తీసుకున్న ఎన్ఎంయుఏ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు చంద్రయ్యని, సీనియర్ నాయకులు కొండుగుంట శీనయ్యని, రతనకర్‌ని ఎన్ఎంయుఏ వాకాడు డిపో అధ్యక్ష కార్యదర్శులు ఆధ్వర్యంలో వాకాడు డిపో కమిటీ, గ్యారేజ్ కమిటీ శాలువా పూల మాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ప్రశాంత్, కార్యదర్శి సంపత్, భాస్కర్, వంశీ, అనిల్, సురేష్, పోలయ్య, సుధీర్, ఎంఎస్ వసూలు రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

## హత్యాయత్న నిందితులు అరెస్టు

**- 16 మందిపై కేసు నమోదు, 11 మంది అరెస్టు, కోర్టు హాజరు**

**- ఒకరి పేరు తప్పించారంటూ బాధితులు ఆందోళన**

దొరవారిసత్రం, జనవరి 31 ప్రభాతవార్త: మండల పరిధిలోని వేణుబాక రోడ్డు సమీపంలో గురువారం రాత్రి వల్లిపి రమణయ్య హరినాథులపై హత్యాయత్నం ప్రయత్నం చేసిన నిందితులను శనివారం పోలీసులు అరెస్టు చేసి సూళ్లూరుపేట కోర్టుకు ప్రవేశపెడుతున్నట్లు విలేకరుల సమావేశంలో నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వర రావు తెలిపారు. వల్లిపి విద్యాసాగర్, బెల్లంకొండ. పెద్ద అంకయ్య, బెల్లంకొండ రాజ్ కుమార్, వల్లిపి ప్రభాకర్, అక్కరపాక ప్రభుద్, బెల్లంకొండ హరీష్, గట్టుపల్లి రామయ్య, గుంజి రమణయ్య, బెల్లంకొండ అజయ కుమార్, బెల్లంకొండ అశోక్, బండి చెంచు కృష్ణ, వీరిని అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు.

## నూతన టిడిపి అధ్యక్షులు పార్టీని బలోపేత చేయడాలి

నాయుడుపేట, జనవరి 31 ప్రభాతవార్త : నియోజకవర్గం లోని పలు మండలాలు, పట్టణాలకు తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షులుగా నియమితులైన నేతలకు నాయుడుపేట పట్టణ మాజీ టిడిపి అధ్యక్షులు కరీంబాయి చెంచయ్య అభినందనలు తెలియజేశారు. పట్టణ అధ్యక్షులుగా షేక్ రఫీ, మండల పార్టీ అధ్యక్షులుగా కామిరెడ్డి అశోక్ కుమార్ రెడ్డి, పెళ్లకూరు మండల పార్టీ అధ్యక్షులుగా సంచి కృష్ణయ్య, ఓజిలి మండల పార్టీ అధ్యక్షులుగా వెంకటసుబ్బయ్య, దొరవారిసత్రం మండల పార్టీ అధ్యక్షులుగా శ్రీనివాసులు నాయుడు, తడ మండల పార్టీ అధ్యక్షులుగా సెల్వంలను పార్టీ అధిష్టానం అధ్యక్షులుగా ప్రకటించిన వారికీ కరీంబాయి చెంచయ్య అభినందనలు తెలియజేశారు.

## రాష్ట్రస్థాయి క్రీడల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సూళ్లూరుపేట, జనవరి 31 ప్రభాతవార్త: రాష్ట్రస్థాయిలో ఇంటర్, పాలిటెక్నిక్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్, నిట్‌లో సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ విద్యార్థులు వివిధ క్రీడల్లో రాణించి విశేష ప్రతిభ కనబరిచారు. ఐపిఎస్‌జిఎం అథారిటీ ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో గోకులకృష్ణ డిప్లొమా విద్యార్థులు కబడ్డీలో ప్రథమ బహుమతి, చదరంగం పోటీల్లో ద్వితీయ స్థానం పొందారు. చదరంగంలో ద్వితీయ స్థానం పొందిన విద్యార్థి ఎస్‌కె మొవెజ్ జాతీయ స్థాయిలో జరిగే చదరంగం పోటీలకు ఎంపికయ్యారు. గెలుపొందిన విద్యార్థులను కాలేజి ఛైర్మన్ జి.బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సురేష్, ఎ.ఓ మనోహర్, పీడీ రాకేష్‌లు ప్రత్యేకంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అభినందించారు.

## అంబటి బహిరంగ క్షమాపణ చెప్పాలి

తడ, జనవరి 31 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై వైసిపి నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు సరికాదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి రాంబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి కామిరెడ్డి మురళి రెడ్డి డిమాండ్ చేశారు.

## బాల్యవివాహాలపై చట్టరీత్యా చర్యలు

వెంకటగిరి, జనవరి 31 ప్రభాతవార్త: బాల్య వివాహాలు జరిపించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సిడిపివో శంషాద్ బేగం తెలిపారు. పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బాల్యవివాహరహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసి పిల్లల భవిష్యత్తు నాశనం చేయకూడదని సూచించారు. సమావేశంలో పాఠశాల హెచ్ఎం రాధా సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థిక అసమానతలు తగ్గేలా ప్రభుత్వ విధానాలు

**-పేదలు పారిశ్రామికవేత్తలు కావాలి-ఎంఎస్ఎంఇ స్థాపించేమహిళలకు బ్యాంకర్లు సహకరించాలి**

**-సిఎం చంద్రబాబునాయుడు**



శాంతిపురం, జనవరి 31 ప్రభాతవార్త: పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాల అమలుతో పాటు అన్ని విధాలా అభివృద్ధి చేందేలా ఆర్థిక అసమానతలు తగ్గించేలా కూటమి ప్రభుత్వ విధానాలు ఉంటాయని సిఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శనివారం వివిధ పథకాల లబ్దిదారులు, ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలతో సిఎం సమావేశయ్యారు. ఈసందర్భంగా మూడు మండలాలను దత్తత తీసుకున్న మేఘా, అదానీ, టివిఎస్ సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. రామకుప్పంలో వంద కుటుంబాలకు జీవనోపాధి కల్పించినట్లు మేఘా ప్రతినిధులు తెలిపారు. అర్హులకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ కల్పించి ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. టివిఎస్ తరపున ముప్పై కుటుంబాలకు చేయూత అందించనట్లు ప్రతినిధులు తెలిపారు. పి4పథకంతో తమ కుటుంబాలుబాగుపడుతున్నాయని లబ్దిదారులకు సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కుప్పంలో ఉద్యాన, డెయిరీ, సిరికల్చర్ వంటి ఉపాధి మార్గాలు ఎంచుకోవాలని సిఎం సూచించారు. 500-700 కుటుంబాలను క్లస్టర్‌గామార్చితే మార్పు కన్పిస్తుందన్నారు. కాగా వన్‌ఫ్యామిలీ వన్ ఎంట్రప్యూనర్ విధానంతో తమకు ఎంతో లబ్ది కలుగుతోందని మహిళలు సిఎంకు వివరించారు. ఎంఎస్ఎంఇ స్థాపకులైన మహిళలకు బ్యాంకర్లు సహకరించాలని ఆదేశించారు.

## దారీ లేకపోతే పొలానికి ఎట్టా పోవాలయ్యా!



రేణిగుంట, జనవరి 31 ప్రభాతవార్త: దారి అడ్డగిస్తే పొలానికి ఎట్టా పోవాలయ్యా అంటూ విప్పమాను పట్టెడకు చెందిన పలువురు రైతులు, రైతు కుటుంబాలు కన్నీటితో ఆవేదన వ్యక్తం చేశారు. రేణిగుంట మండలం విప్పమాను పట్టెడ గ్రామం సర్వే నంబర్ 453/6 నందు పొలాలు ఉన్న రైతులు పొలాల బండి బాట వద్ద శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఓ వ్యక్తి బండి బాటను తన పట్టా స్థలమంటూ మూసి వేసాడని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ దురుద్దేశంతో ఈ ప్రక్రియకు పాల్పడ్డాడని కన్నీటి పర్యంతం అయ్యారు. తనకున్న రాజకీయ పలుకుబడితో పట్టాదారు పాసు పుస్తకం తెచ్చుకున్నాడని తెలిపారు. గత కొన్ని తరాలుగా రైతులంతా వ్యవసాయం కోసం బండి బాటను వినియోగించుకునేవారమని అన్నారు. బండి బాటను మూసేశారని ఎంతమంది అధికారులు చుట్టూ తిరిగిన ఫలితం కనిపించలేదన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వద్దకు వెళ్లి తమ బాధను వినిపించామని తక్షణం స్పందించిన ఆయన మంచి మనసుతో దారి సమస్యను పరిష్కరించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారన్నారు. ఆయనతో సరేనని చెప్పిన అధికారులు కోర్టు సాకు చెప్పి వెనక్కు వెళ్లారన్నారు. సదరు వ్యక్తి గత ఒకటిన్నర సంవత్సరం నుండి తమపై ఇలా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. తమకు బాటలేకపోతే లక్షల ఖర్చుపెట్టి వేసుకున్న వరి పంట, చెరుకు పంట తెచ్చుకొనే అవకాశం లేదన్నారు. దాదాపు 25రైతు కుటుంబాలు బాటను ఆసరా చేసుకుని వ్యవసాయం చేసుకుంటున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో విజయ్ కుమార్, లావణ్య, సుబ్రహ్మణ్యం, దొరస్వామి రెడ్డి, శంకర్ రెడ్డి, శాంతమ్మ, రాజేశ్వరమ్మ, శ్రీలత, చంద్రయ్య, పార్థసారథి, మోహన్, విమలమ్మ, తదితరులు పాల్గొన్నారు..

## ఎన్టీఆర్‌భరోసా పెన్షన్లు అందించిన సిఎం



గుడుపల్లె, జనవరి 31 ప్రభాతవార్త: కుప్పం పర్యటనలో భాగంగా సిఎం చంద్రబాబు నాయుడు శనివారం బెగ్గిలపల్లి గ్రామంలో పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేశారు. నేరుగా లబ్దిదారుల ఇళ్లకు వెళ్లిన సిఎం చంద్రబాబు వారి కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న మునెమ్మ, చిన్నతాయమ్మ, వెంకట రామప్పలకు వృద్ధాప్య, వితంతు పింఛన్లను పంపిణీ చేశారు. లబ్దిదారుల కుటుంబీకులతో ముఖ్యమంత్రి ముచ్చటించి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

## పాపపు పనులు చేసి పరిశుద్ధ మాటలా!

**-వైసిపి నేతలపై కాంగ్రెస్ చిట్టిబాబు మండిపాటు**



తిరుపతి, జనవరి 31ప్రభాతవార్త: ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం, టిటిడి బోర్డు పెద్దలు వెంకటేశ్వర స్వామి వద్ద క్షమించరాని పాపాలను చేశారని కాంగ్రెస్‌పార్టీ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు అన్నారు. లడ్డూలను అసలు నెయ్యే కానీ రసాయనాలతో తయారుచేసి స్వామి వారికి నివేదించడం, భక్తులకు పంచడం తిరుమల చరిత్రలోని క్షమించరాని అత్యంత ఘోరమైన పాపమన్నారు. చేసిన పాపాలను కప్పిపుచ్చుకునేలా తాము ఉత్తములని, పరిశుద్ధులని, పవిత్రులమని, అమాయకులమని పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతూ శ్రీవారి భక్తులను, ప్రజలను నమ్మించడానికి వైసిపి నాయకులు నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. అసలు నెయ్యి స్థానంలో రసాయనాలతో తయారు చేసిన నెయ్యిని వినియోగించడమే అత్యంత దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. నిబంధనలు సడలించి రసాయనాలు కలిపిన నెయ్యిని, తిరుమలకు తెచ్చారో తేలాల్సి ఉందని చిట్టిబాబు డిమాండ్ చేశారు.

## చంద్రబాబుకు అంబటి క్షమాపణలు చెప్పాలి

**-ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు, జనవరి 31 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వైసిపికి చెందిన మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా వున్నాయని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అంబటి రాంబాబు వ్యాఖ్యలతో వైకాపా రాజకీయ సంస్కృతి ఎంతగా దిగజారిందో స్పష్టమవుతోందన్నారు. రాంబాబు లాంటి ఒక రాజకీయ నాయకుడిగా కొనసాగడం ఈ సమాజానికి మంచిది కాదని పేర్కొన్నారు. అంబటి చేసిన వ్యాఖ్యలకు ఆయనే కాకుండా అలాంటి వారిని అడ్డుకోలేని వైకాపా అధినేత జగన్మోహనరెడ్డి కూడా చంద్రబాబు నాయుడుకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గత వైకాపా ఎదుర్కొన్న ఘోరపరాజయానికి ప్రజలను నిందించడం హాస్యాస్ప దమని, ఆ పార్టీ పతనానికి బాధ్యత వైకాపా నాయకులదేనని తెలిపారు. ప్రజలను, వ్యవస్థలను, రాజ్యాంగ బద్ధ సంస్థలను, వ్యక్తులను దూషిస్తూ మాట్లాడడమే రాజకీయ బలం అనే భ్రమలో వైకాపా నాయకులున్నారని, అదే వారి రాజకీయ పతనానికి కారణమని పేర్కొన్నారు.

## దేవగుడి సినిమాను వీక్షించిన హీరోయిన్ అనుశ్రీ



తిరుపతి హెల్త్, జనవరి 31 ప్రభాతవార్త: దేవగుడి సినిమా విడుదల సందర్భంగా తిరుపతిలోని గ్రూప్ థియేటర్ మినీ ప్రతాప్‌లో హీరోయిన్ అను శ్రీ ప్రేక్షకులతో కలిసి సినిమా చూశారు. ఈ చిత్రం హీరో అభినవ శౌర్య నటించిన ప్రత్యేక ప్రతిక్షణాలతో ఆసక్తి రేకెత్తించింది. అను శ్రీ మాట్లాడుతూ సినిమా విడుదల ముందు తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని, ఆయన పాదాల చెంత ఈ చిత్రాన్ని చూడటం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. సినిమాలో నటించిన ప్రతి ఒక్కరూ తనను ఆప్యాయంగా చూసుకున్నారని, సినిమా టీమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. థియేటర్ ఫుల్ కావడం సంతోషంగా ఉందని, సినిమా మరింత హిట్ కావాలని వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు, ప్రేక్షకుల దీవెనలు కావాలని కోరారు.

## మీ సేవలు పోలీసుశాఖకు అమూల్యం : జిల్లా ఎస్పీ



తిరుపతి, జనవరి 31ప్రభాతవార్త: తిరుపతి జిల్లా పోలీస్ విభాగంలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన తొమ్మిది మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి శనివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవీ విరమణ పొందిన అధికారులకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు, డీఎస్పీలు. డీఎస్పీలు, సీఐలు, పోలీస్ అధికారులు, పదవి విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అంబటి రాంబాబును కఠినంగా శిక్షించాలి : విజయ్‌బాబు



పుత్తూరు, జనవరి 31 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఉద్దేశించి దుర్భాషలాడిన వైసిపికి చెందిన మాజీ మంత్రి అంబటి రాంబాబును కఠినంగా శిక్షించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా ఒక మాజీ మంత్రిగా అంబటి రాంబాబు తన స్థాయిని దిగజార్చు కున్నారని తెలిపారు. ప్రజా జీవితంలో వుంటూ బహిరంగంగా ప్రజల మధ్య అటువంటి నీచమైన పదాలతో దూషణ చేయడం వల్ల రాంబాబుతో పాటు వైసిపిని ప్రజలు చీదరించుకుంటారని పేర్కొన్నారు. బూతులు మాట్లాడడం, తాము తప్పులు చేసి ఎదురు దాడికి దిగడం వైసిపి సంస్కృతిగా మారిపోయిందని తెలిపారు. సిఎంను దుర్భాషలాడిన మాజీ మంత్రిపై పోలీసులు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కోకాకోలా అప్రెంటిస్‌షిప్‌కు...వర్సిటీ విద్యార్థులు ఎంపిక



యూనివర్సిటీ(తిరుపతి), జనవరి 31ప్రభాతవార్త: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎం.ఎస్సీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఫుడ్ టెక్నాలజీ 10వ సెమిస్టర్ విద్యార్థులు అద్భుతమైన మైలురాయిని చేరుకున్నారు. శ్రీకాళహస్తిలోని హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఏడాది కాలం పాటు అప్రెంటిస్‌షిప్ చేసే అవకాశాన్ని దక్కించుకున్నారు. విద్యార్థుల అంకిత భావం, విద్యా నైపుణ్యం, పారిశ్రామిక రంగంలో వారి సంసిద్ధతకు ఈ విజయం నిదర్శనంగా నిలుస్తోందని వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన 22 మంది విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా కలిసి అభినందించారు. ఇలాంటి విజయాలు విశ్వవిద్యాలయానికి గర్వకారణమని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సంస్థ ప్రతిష్టను ఇవి పెంపొందిస్తాయని ఆమె కొనియాడారు. విద్యార్థులను ప్రోత్సహించిన వారిలో ఐ.ఎఫ్.టి కోఆర్డినేటర్ డాక్టర్ జి. శిరీష, హెచ్.ఓ.డి డాక్టర్ వి. బిందు, ఎం. అరుణ, ఎన్. రజని, ఎం. నిహారిక, డి. మాధవి మరియు ఏ.ఎం. బేయులా తదితరులు ఉన్నారు.

## వరదరాజస్వామి ఆలయానికి పాలకమండలి



శ్రీకాళహస్తి, జనవరి 31 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయానికి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి కొత్తపాలక మండలిని నియమించారు. ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పనులు సుమారు ఐదేళ్ళుగా నత్తనడకన సాగుతున్నాయి. నిధులున్నా పనులు సాగటం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు గడుస్తున్నా వరదరాజ స్వామి ఆలయ పనుల్లో అనుకున్నంత వేగం కనబడటం లేదు. పలు అంశాలను పరిగణలోకి తీసుకున్న శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఈ పనుల్లో చురుకు కల్గించుటకు ధర్మకర్తల మండలిని నియమించారు. ఈ కమిటి పగ్గాలను ఆలయానికి సమీపంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన అద్దంకి పి.భాగ్యలక్ష్మికి ఛైర్మెన్ బాధ్యతలు అప్పగించారు. సభ్యులుగా ఏ మాధవి, వి.జయప్రకాష్, ఎస్.మురళి, మల్లికార్జున్ శర్మ, వి.ఈశ్వరయ్య, ఎంజి బాలాజి, ప్రకాష్, బి.పద్మశ్రీ, జే.వెంకటేష్, బి.మధుసూధనరావు, బి.మహేంద్ర సింగ్, ఎన్.లీలావతి, పూల శేఖర్, మద్దు వాసు యాదవ్, అరిగల వెణుగోపాల్‌లకు అవకాశం కల్పించారు. వారిని అభినందించి నియామక పత్రాలను అందించారు.

## అధికారుల తీరుపై హైకోర్టును ఆశ్రయిస్తాం

తిరుపతి విద్య, జనవరి 31 ప్రభాతవార్త: ఎస్వీయూలో విచ్చల విడిగా నిధుల దుర్వినియోగం జరుగుతోందని తక్షణం సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని పూర్వ విద్యార్థి అడ్వకేట్ మహేష్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. వర్సిటీలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, విద్యార్థుల సొమ్మును కాజేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఎస్వీ ఆర్ట్స్ మెన్స్ హాస్టల్ నందు జరిగిన నిధుల దుర్వినియోగంపై తాను ఆర్టీఐ ద్వారా కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ హాస్టల్ రికార్డులు తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ తనిఖీలలో వర్సిటీ అధికారులు సరైన రసీదులు లేకుండా కళాశాలకు సంబంధించిన చెక్కులను తమకు అనుకూలమైన సప్లయర్స్‌కు పంపిణీ చేసినట్లు తేలిందని మండిపడ్డారు. అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో త్వరలో హైకోర్టును ఆశ్రయిస్తామని ఆ ప్రకటనలో హెచ్చరించారు.

## చదువుతో పాటు క్రీడలలోనూ రాణించాలి

తిరుపతి విద్య, జనవరి 31 ప్రభాతవార్త: విద్యార్థులు అకడమిక్ విద్యతో పాటు క్రీడలోనూ రాణించాల్సిన అవసరం ఉందని టీటీడీ విజిలెన్స్ వింగ్ ఆఫీసర్ ఎస్వీవీ రామ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జాతీయ సంస్కృత వర్సిటీలో సౌత్ జోన్ సాంస్క్రిట్ స్టూడెంట్స్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రీడాలు ఎంతో ప్రధానమని, ఉపాధి ఉద్యోగావకాశాలల్లో క్రీడాకారులకు ప్రత్యేక రిజర్వేషన్ ఉందన్నారు.